సాక్షి వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 15 । మార్చి । 2024



లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే స్కానింగ్ సెంటర్లు, వైద్యుల వైద్య వృత్తిని శాశ్వతంగా రద్దు చేస్తామని సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ హెచ్చరించారు. -10లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సహర్ శని (ఉ॥)
కడప	: 6.30	5.07
పులివెందుల	: 6.33	5.02
ప్రొద్దుటూరు	: 6.32	5.11

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.8/26.4

జిల్లాలో గురువారం 26.4 - 40.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.32 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

యువ క్రికెటర్‌కు ప్రభుత్వం అండ



రూ.10 లక్షల చెక్కును క్రీడాకారిణి గాయత్రికి అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప స్పోర్ట్స్: 'ఆడుదాం ఆంధ్ర' రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి టాలెంట్‌హంట్‌కు ఎంపికైన వైఎస్‌ఆర్ కడప జిల్లా పులివెందుల జేఎన్‌టీయూ కళాశాల బీటెక్ విద్యార్థిని కె. గాయత్రికి ప్రభుత్వం అండగా నిలిచింది. టాప్–14 టాలెంట్ ప్లేయర్స్ జాబితాలో చోటు దక్కించుకున్న ఈ యువ క్రికెటర్‌కు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది. గురువారం రాత్రి కడపలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో గాయత్రికి రూ.10 లక్షల చెక్కును ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్ బాషా అందజేశారు.

ఆర్టీసీకి రూ. 12.76 లక్షల ఆదాయం

కడప కోటిరెడ్డిసర్కిల్: లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతర సందర్భంగా ఈనెల 11వ తేదీన జిల్లాలోని కడప, పులివెందుల డిపోల నుంచి 43 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి 18,713 కిలోమీటర్లు తిప్పడం ద్వారా రూ. 12,76,844 ఆదాయం వచ్చినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పోలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి 23 బస్సుల ద్వారా 9369 కిలోమీటర్లు తిప్పడం ద్వారా రూ. 6,48,009, పులివెందుల డిపో నుంచి 20 బస్సు 9344 కిలోమీటర్లు ప్రయాణించడం ద్వారా రూ. 6,28,835ల ఆదాయం వచ్చిందన్నారు. ఆర్టీసీ బస్సులను ఆదరించి ప్రయాణం చేసి ఆదాయం రావడానికి తోడ్పడిన భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

తలనీలాల వేలం.. రూ.65లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

వేంపల్లి: చక్రాయపేట మండలంలోని గండి క్షేత్రం దేవస్థానానికి సంబంధించి తలనీలాల వేలం ద్వారా రూ.65.11లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. గురువారం నలుగురు సభ్యులు వేలంపాటలో పాల్గొనగా సికింద్రాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హెయిర్ ఎంటర్ ప్రైజస్ ప్రొప్రైటర్ ఆదినారాయణ దక్కించుకున్నారు. గతంలో తలనీలాలకు రూ.55లక్షలు పాడగా ప్రస్తుతం రూ.10లక్షలు అధికంగా పాడారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ మాట్లాడుతూ గండిక్షేత్రం అభివృద్ధికి మరింత కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ తనిఖీదారు రమణ, ప్రధాన అర్చకులు కేసరి, ఉపప్రధాన అర్చకులు రాజస్వామి పాల్గొన్నారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలపై నేడు సమీక్ష సమావేశం

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి శుక్రవారం టీటీడీ అధికారులతో జేఈఓ వీరబ్రహ్మం సమీక్ష సమావేశం నిర్వహిస్తారని ఆలయ డిప్యూటీ ఈఓ నరేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు సంబంధించి జరుగుతున్న పనులను పరిశీలించి, అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తారని తెలిపారు.

రైలులో టమాటా పంట ఎగుమతికి చర్యలు

మదనపల్లె సిటీ: రైలులో టమాటా పంట ఎగుమతికి అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రైల్వేశాఖ గుంతకల్లు సినియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ మనోజ్, ఆపరేటింగ్ మేనేజర్ శ్రావణ్ తెలిపారు. గురువారం స్థానిక టమాటా మార్కెట్ కమిటీ కార్యాలయంలో మండీ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మదనపల్లె రోడ్డు (సీటీఎం రైల్వేస్టేషన్) నుంచి దూర ప్రాంతాల మార్కెట్లకు ఎగుమతి చేసేందుకు ప్రత్యేక బోగీ కేటాయిస్తామని చెప్పారు. ఢిల్లీతో పాటు విజయవాడ, నర్సాపురం, భీమవరం తదితర నగరాలకు రవాణా సౌకర్యం అందుబాటులో తీసుకువస్తామన్నారు. రవాణా చార్జీలపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి అభిలాష్, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, సీటీఎం రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సలహాదారుడు కృష్ణయ్యవర్మ, మార్కెట్‌యార్డు కమిటీ సభ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.

- 'పుత్తా'కు భంగపాటు
- ఎమ్మెల్యే కావాలన్న కోరిక నెరవేరని వైనం
- కమలాపురం టీడీపీ అభ్యర్థిగా పుత్తా చైతన్యరెడ్డి
- ప్రొద్దుటూరులో ఇన్‌చార్జి ప్రవీణ్‌కు ఆశాభంగం



కల చెదిరింది



సాక్షి ప్రతినిధి కడప: కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి భంగపాటుకు గురయ్యారు. ఎన్నో ఏళ్లుగా ఎమ్మెల్యే కావాలనే కోరిక ఆయనకు ఇక కలగా మిగలనుంది. నాలుగుమార్లు పోటీ చేసి విఫలయత్నం కాగా, మరో అవకాశం కోసం కృషి చేశారు. ఈమారు టీడీపీ అధిష్టానం టిక్కెట్ నిరాకరించింది. గురువారం ఆయన స్థానంలో కుమారుడు చైతన్యరెడ్డికి టిక్కెట్ కట్టబెట్టింది. 2004 నుంచి కమలాపురం అసెంబ్లీ బరిలో పుత్తా నరసింహారెడ్డి నిలుస్తున్నారు. తొలి ప్రయత్నంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన గట్టి పోటీ ఇచ్చారు. 2009 నాటికి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన 'పుత్తా' మరోమారు ఓటమి చెందారు. 2014లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన 'పుత్తా' ఈమారు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. 2019లో నాలుగోసారి పోటీ పడగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హవాలో కొట్టుకుపోయారు.

వైఎస్సార్ చలువతో ఎమ్మెల్సీగా ఎంపిక

తృతీయ ఫ్రంట్ పేరుతో కమలాపురం నియోజకవర్గంలో ప్రత్యేక గ్రూపునకు నాయకుడిగా ఉన్న పుత్తా నరసింహారెడ్డిని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేరదీశారు. అప్పట్లో డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి కాంగ్రెస్ పార్టీ వీడి తెలుగుదేశంలో చేరడంతో ఆ స్థానంలో డాక్టర్ వైఎస్సార్ 'పుత్తా'ను తెరపైకి తీసుకొచ్చారు. ఈ ఎన్నికల్లో ఎంవీ మైసూరారెడ్డి, వీరశివారెడ్డిలు ఒక్కటై పోటీలో ఉండగా, కాంగ్రెస్ అభ్యర్థిగా 'పుత్తా' గట్టిపోటీ ఇచ్చారు. 11,288 ఓట్ల తేడాతో ఓడిపోయారు. తర్వాత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2006లో శాసనమండలి సభ్యునిగా స్థానిక సంస్థల కోటాలో ఎంపిక చేశారు. ఆ మేరకు ఎమ్మెల్సీగా శాసనమండలిలోకి ప్రవేశించారు. తర్వాత చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో అప్పటి ఎమ్మెల్యే వీరశివారెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో విబేధించిన పుత్తా నరసింహారెడ్డి టీడీపీలో చేరారు. 2009 ఎన్నికల నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వీరశివారెడ్డి చేతిలో 4163 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2014లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోచంరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి పోటీ చేయగా, టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన పుత్తా 5345 ఓట్ల తేడాతో మరోమారు ఓడిపోయారు. 2019లో పి.రవీంద్రనాథ్‌రెడ్డితో పోటీ పడగా 27,333 ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. నాలుగుసార్లు పోటీచేసి ఓడిపోయిన 'పుత్తా' ఈమారు మరో ప్రయత్నం చేయగా టీడీపీ అధిష్టానం టిక్కెట్ నిరాకరించింది. దీంతో పుత్తా నరసింహారెడ్డి ఎమ్మెల్యే కావాలనే కోరిక కలగా మిగిలిపోవడం విశేషం. ఆయన కుమారుడు చైతన్యరెడ్డిని ఈమారు టీడీపీ అభ్యర్థిగా కమలాపురం బరిలో నిలవనున్నారు.

'వరద' వైపే అధిష్టానం మొగ్గు

టీడీపీ అధిష్టానం మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి వైపే మొగ్గు చూపింది. ప్రొద్దుటూరు అభ్యర్థిత్వం కోసం నలుగురు పోటీ పడ్డారు. కాగా, ఇప్పటికే టీడీపీ అభ్యర్థిగా గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పోస్టర్లు సైతం వేయించుకుని ప్రచారం కొనసాగిస్తున్నారు. అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతోనే ప్రచారం చేస్తున్నట్లుగా ప్రవీణ్ చెప్పుకురావడం విశేషం. పైగా పార్టీకి అండగా ఎవరూ లేని సమయంలో పార్టీ జెండా మోసానంటూ బాహాటంగా చెప్పుకొచ్చారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ యువకుడు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఆశీర్వదించాలని సూచించారు. ఈ పరిస్థితుల్లో తనకే టిక్కెట్ అన్న ధీమా ప్రవీణ్‌లో కనిపించింది. అంతలోనే ప్రవీణ్‌కు ఆశాభంగం ఏర్పడింది. మరోవైపు వరదకు టిక్కెట్ ఇస్తే తాము రాజకీయ సన్యాసం స్వీకరించాలని మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి బాహాటంగా అసంతృప్తిని వ్యక్తపరిచారు. ఇవేమి పరిగణలోకి తీసుకోకుండా అధిష్టానం వరదరాజులరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడం విశేషం.

ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థిగా వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నంద్యాల వరదరాజులరెడ్డిని పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. గురువారం టీడీపీ అధిష్టానం విడుదల చేసిన రెండో జాబితాలో మాజీ ఎమ్మెల్యే వరద పేరును ప్రకటించడంతో ఉత్కంఠకు తెరపడింది. ఇక్కడి టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డి, సీఎం సురేష్‌నాయుడు ప్రొద్దుటూరు టికెట్ కోసం తీవ్రంగా పోటీ పడ్డారు. తమకే టికెట్ వస్తుందంటూ ఎవరికి వారు విడివిడిగా ప్రచారం చేపట్టారు. వీరి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడానికి టీడీపీ అధిష్టానం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించింది. ఈ క్రమంలో నంద్యాల వరదరాజులరెడ్డిని పార్టీ అధిష్టానం ఖరారు చేసింది. దీంతో వరద శిబిరంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. తనకు టికెట్ రావడానికి ప్రధాన కారణం ప్రొద్దుటూరు ప్రజలేనని వరదరాజులరెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు.

విద్యార్థులకు అభినందన



జాతీయస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఆర్‌జేడీ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్–2023 ప్రదర్శనలో ప్రతిభను చాటి జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల విద్య ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ, కడప డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డిలు అభినందించారు. ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో నిర్వహించిన ఏపీ ఇన్‌స్పైర్ మనాక్ రాష్ట్రస్థాయి పోటీల్లో పొద్దుటూరు ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌కు చెందిన షేక్ అసిఫా(అలారం టు ప్రొటెక్టు లైఫ్ అండ్ లింబ్స్) కడప నాగార్జున మోడల్ స్కూల్‌కు చెందిన అభిలాస్(ఫ్రూట్ ఐడెంటీ ఫైర్) హితేష్‌జైన్(విజన్ అలర్ట్ ఫర్ స్టూడెంట్), కమలాపురం ఏపీ బీసీబ్యూఈఐఎస్‌కు చెందిన రుగ్వేద్‌వర్మ (ఐఓటీ స్మార్ట్ మిర్రర్ విత్ న్యూస్ అండ్ టెంపరేచర్) తమ ప్రాజెక్టులను ప్రదర్శించి రాణించారు. గురువారం జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌జేడీ, డీఈఓ డిప్యూటీ ఈఓలను విద్యార్థులు కలిసి, వారు అందుకున్న ప్రశంసాపత్రాలు, మెమెంటోలను చూపించారు. ఈసందర్భంగా ఆర్‌జేడీరాఘవరెడ్డి మాట్లాడుతూ ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో కూడా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

పులివెందుల: ప్రజలు ఎలాంటి భయానికి లోను కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. గురువారం ఆయన పులివెందుల నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన చక్రాయపేట మండలంలోని కుమారకాల్వ, ఎర్రబొమ్మనపల్లి, వేముల మండలంలోని అలవలపాడు ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందని, ఎవ్వరి ప్రలోభాలు, బెదిరింపులకు భయపడవద్దని చెప్పారు. ఎవరైన ప్రలోభాలకు గురిచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాజు, ఆర్కెవ్యాలీ సీఐ గోవిందరెడ్డి, పులివెందుల రూరల్ సీఐ బాలమద్దిలేటి, వేంపల్లి సీఐ చాంద్‌బాషా, ఎస్సైలు రంగారావు, ధనుంజయుడు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

రూ.17.50 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభం



లిఫ్టఇరిగేషన్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి చిత్రంలో మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే సుధ తదితరులు

కలసపాడు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని దూలంవారిపల్లె గ్రామం వద్ద రూ.17.50 కోట్లతో చేపట్టిన ఎత్తిపోతల పథకాన్ని ఎంపీ ప్రారంభించారు. ముందుగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ బద్వేలు ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎగువరామాపురం, తెల్లపాడు, ఎగువ తంబళ్ళపల్లె, రెడ్డిపల్లె గ్రామాలకు చెందిన రైతులు కరువు కాటకాలతో ఇబ్బందిపడుతున్నామని, మాకు బ్రహ్మంసాగర్ నుండి లిఫ్టఇరిగేషన్ ద్వారా నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలను కోరడంతో స్పందించిన వారు నా దృష్టికి తీసుకొచ్చారన్నారు. వెంటనే నిధులు విడుదల చేసి జనవరి 2న లిఫ్టఇరిగేషన్ పనులకు భూమిపూజ చేశామని, పది వారాల్లోనే పైపులైన్ పూర్తి చేసి తడుకుచెరువు, మేలకుంటచెరువు, దూలంవారిపల్లె చెరువులకు ప్రత్యక్షంగా నీటిని ఇస్తున్నామని, పరోక్షంగా మరో నాలుగు చెరువులకు నీటిని అందజేస్తామని తెలిపారు.ఈ ఎత్తిపోతల పథకాన్ని రైతులకు అంకితం చేస్తున్నట్లు అయన తెలిపారు. రైతుల కోసం కష్టపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ అధ్యక్షులు, కడప మేయర్ కె.సురేష్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, బద్వేలు నియోజకవర్గ అదనపు సమన్వయకర్త విశ్వనాథరెడ్డి, పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఆదిత్యరెడ్డి, ఉద్యానశాఖ రాష్ట్ర సలహాదారు సంబటూరుప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు సుధాకర్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, ఇరిగేషన్ సీఈ మల్లికార్జునరెడ్డి, ఎస్‌ఈ వెంకటరామయ్య, డీఈ వాసుదేవరెడ్డి, క్లాస్–1 కాంట్రాక్టర్ పోకలమల్లికార్జునరెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ పోకలరామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అంకనగురివిరెడ్డి, సూదారామకృష్ణారెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, నారాయణయాదవ్, చిత్తారాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- రూ.6.25 కోట్ల ఎంపీ లాండ్స్ నిధులతో అన్ని హంగులతో బీసీ భవనం నిర్మాణం



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్‌యాదవ్ తదితరులు

కడప రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం జరుగుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషాలు తెలిపారు. గురువారం ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ 6.25 కోట్ల ఎంపీ లాండ్స్ నిధులతో గురువారం కడపలోని పాత రిమ్స్‌లో నిర్మించిన బీసీ భవన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ బీసీల చిరకాల కోరిక నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఒకటిన్నర ఏడాది కిందట ఈ స్థలానికి భూమి పూజ చేశామని, సరిగ్గా 18 మాసాలకు బీసీ భవనం పూర్తి చేసి బీసీలకు అందజేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఎంపీ లాండ్స్ నిధుల నుంచి రూ.6.25 కోట్ల ఖర్చు చేసి ఈ బీసీ భవనం నిర్మాణం చేసినట్లు చెప్పారు. బీసీలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈ బీసీ భవనాన్ని వినియోగించాలని అర్థవంతంగా బాధ్యతగా నిర్వహణ చేయాలని చెప్పారు.

- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా మాట్లాడుతూ ఈరోజు చాలా శుభదినమన్నారు. జిల్లాలోని బీసీ సోదర సోదరీమణులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బీసీ భవన్ ఈరోజు ప్రారంభోత్సవం చేసుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. బీసీ భవన్ వచ్చేందుకు ముఖ్య కారకులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, కడప నగర మేయర్ కే సురేష్ బాబు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌లని అన్నారు. ముఖ్యమంత్రికి జిల్లా బీసీల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు. బీసీ భవనం నగరం నడిబొడ్డున ఉండాలని పట్టుబట్టి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఈ స్థలాన్ని ఇప్పించారని అన్నారు. ఈ సందర్భంగా మనమందరం ఎంపీకి కృతజ్ఞతలు తెలుపుకోవాలన్నారు. ఈ బీసీ భవనంలో ఒక లైబ్రరీని కూడా నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, నగర మేయర్ కె.సురేష్ బాబు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, ఎం రామచంద్రారెడ్డి, బీసీల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డికి కతజ్ఞతలు తెలుపుకుంటున్నానని చెప్పారు. రాష్ట్రంలో ఇంత అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బాసటగా ఉండి ఆశీర్వదించాలని అన్నారు.
- కడప నగర మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ బీసీల కొన్ని ఏళ్ల కల నేటికి సాకరమైందన్నారు. జిల్లా నలుమూల నుంచి వచ్చిన బీసీలకు ఈ బీసీ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం వచ్చిన ఏ ప్రభుత్వం.. ఏ నాయకుడు బీసీలకు న్యాయం చేయలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక బీసీ భవన్ నిర్మాణానికి రూపకల్పన జరిగిందన్నారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ లు కలిసి సీఎంకు తెలియజేయగా వెంటనే బీసీ భవన నిర్మాణానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. బీసీ భవనం నిర్మాణానికి కషిచేసిన ఎంపీకి కతజ్ఞతలు తెలుపుకుంటున్నామని చెప్పారు.ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య యాదవ్, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వర్ రెడ్డి, ఈఈ ప్రభాకర్ నాయుడు, డి ఈ కళ్యాణి, ఏ ఈ శ్రీహరి, బంగారు నాగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


జగనన్నకు మహిళల ఆశీస్సులు



అగ్రవర్ణ మహిళల ఆర్థిక పరిస్థితులను కూడా గుర్తించి సాయం అందిస్తున్న జగనన్నకు ధన్యవాదాలు. ప్రభుత్వం అందించిన సాయాన్ని వ్యాపార పెట్టుబడిగా పెట్టుకుంటున్నా. ఈబీసీ నేస్తంతోపాటు.. పెన్షన్, కూడా అందుకుంటున్నాను. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రికి మహిళల ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయి.

– ఎ.శ్రీమూర్తి దేవి, ప్రకాశ్ నగర్, కడప

సీఎం నమ్మకాన్ని రెట్టింపు చేస్తాం



అన్ని రకాల సంక్షేమ పథకాలతో పాటు ఈబీసీ నేస్తం సాయం కూడా అందుతోంది. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని.. ఆర్థికంగా నిలదొక్కుకోగలమనే నమ్మకం మాలో రెట్టింపు అవుతోంది. మాపై సీఎం పెంచుకున్న నమ్మకాన్ని మరింత రెట్టింపు చేసి చూపిస్తాం.

– పి. ఉమాదేవి, బుగ్గ అగ్రహారం, కడప

పేదల ఆర్థికవృద్ధికే ఈబీసీ నేస్తం

- డీఆర్వో గంగాధర్ గౌడ్
- జిల్లాలో 34,145 మందికి రూ.51.21 కోట్ల జమ



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్: ఈబీసీ వర్గాలకు చెందిన పేద మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈబీసీ నేస్తం పథకాన్ని తీసుకొచ్చిందని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్ తెలిపారు. గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లె బహిరంగ సభ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మూడో విడత 'ఈబీసీ నేస్తం'లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.15 వేల సాయం మొత్తాన్ని జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ వీసీ హాలునుంచి డీఆర్వో, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ హాజరయ్యారు. సీఎం వీసీ అనంతరం జిల్లా వ్యాప్తంగా 34,145 మంది అగ్రవర్ణ పేద మహిళలకు 3వ విడతగా మంజూరైన రూ.51,21,75,000 మెగా చెక్కు రూపంలో డీఆర్వో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈబీసీ నేస్తం పథకం ద్వారా అగ్రవర్గాల్లోని 'ఓసీ'వర్గాలకు చెందిన రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, కమ్మ, సయ్యద్ సంబంధిత ఉప కులాల్లోని 45 నుంచి 60 ఏళ్లలోపు పేద మహిళలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రభుత్వం అందించే ఈబీసీ నేస్తం సాయంతో జీవనోపాధితోపాటు వారి జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడనున్నాయన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క నిరుపేద మహిళ కూడా.. సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనేదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అర్హత ఉండి లబ్ధి చేకూరడంలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధితశాఖ అధికారులను లేదా స్థానిక సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ, మైనారిటీ సంబంధిత సంక్షేమ శాఖాధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక భద్రత కల్పిస్తున్నారు



ముఖ్యమంత్రి ఆర్థిక సాయంతోపాటు సామాజిక భద్రతను కల్పిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలు మహిళల పాలిట వరంగా మారాయి. మహిళల ఆర్థిక ప్రగతికి పాటుపడుతున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే.

–సి.లక్ష్మీదేవి, ఎర్రముక్కపల్లె, కడప

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ఈబీసీ నేస్తం'పథకం మా కుటుంబానికి బతుకు నేస్తంగా మారింది. జగనన్న అమ్మఒడి, ఒంటరి మహిళ పెన్షన్ పథకాలతోపాటు రుణమాఫీ సాయం కూడా అందాయి. మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ఆడబిడ్డల ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు సీఎం ఎంతో చేస్తున్నారు.

– జే.రమాదేవి, ఇండస్ట్రియల్ ఎస్టేట్, కడప

క్లుప్తంగా

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీ నాగంవారిపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. స్థానికంగా నివాసం ఉన్న బయన్న కుమారుడు కందూరి కృష్ణ(58), సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుని వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు చెప్పారు.

కాపర్ వైర్ చోరీ



ట్రాన్స్‌ఫారం పగులగొట్టి కాపర్ వైర్‌ను చోరీ చేసిన దుండగులు

సింహాద్రిపురం : మండల పరిధిలోని వై కొత్తపల్లె గ్రామంలో రైతు ముకుందారెడ్డి పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారంను దొంగలు పగులగొట్టి కాపర్ వైరు చోరీ చేసిన ఘటన వెలుగుచూసింది. రైతు తెలిపిన వివరాల మేరకు... గురువారం తన పొలం పక్కన ఉన్న రైతు అశోక్‌రెడ్డి పొలానికి నీటి తడులు అందించడానికి వెళ్లగా ట్రాన్స్‌ఫారం వద్ద వైర్లన్ని కట్ చేసి ఉండడం గమనించాడు. వెంటనే ఈ విషయాన్ని తెలపగా పొలం వద్దకు చేరుకున్నాడు. చోరీ జరిగిన విషయాన్ని ఎస్సై అరుణ్‌కుమార్‌కు వివరించారు. కేసు నమోదైంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ

5వ వార్డులో టీడీపీ ఖాళీ: ఎమ్మెల్యే



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో దాదాపుగా తెలుగుదేశం పార్టీ ఖాళీ అయినట్లేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. వార్డుకు చెందిన టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రసాద్ రెడ్డితోపాటు వంద కుటుంబాలు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల్లో లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి కుటుంబాలన్నీ టీడీపీకి పనిచేశాయన్నారు. జగనన్న పరిపాలనకు ఆకర్షితులై వారంతా స్వచ్ఛందంగా పార్టీలో చేరారన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషి చేసిన వారందరికి భవిష్యత్తులో ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. నియోజకవర్గంలో రూ.1700 కోట్లతో సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నా నియోజకవర్గానికి ఏ అభివృద్ధి జరగలేదన్నారు. ఒక్క మారు జగనన్న ముఖ్యమంత్రి కావడంతో ప్రజల కోసం కూరగాయల మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్, పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణం, వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి నిర్మాణం, ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ కళాశాల, జిల్లా ప్రభుత్వాస్పత్రికి నిధులు మంజూరు చేయించామయన్నారు. రూ.290 కోట్లతో తాగునీటి పైపులైన్ నిర్మాణం, మురుగు కాలువల ఆధునీకరణ పనులు చేపడుతున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టిబాబు, కోనేటి సునంద, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సతీమణి రాచమల్లు రమాదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అరవ చెన్నారెడ్డి, కేశవ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శులు పోరెడ్డి నరసింహారెడ్డి, లక్కిరెడ్డి పవన్‌రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కడప అర్బన్ : కడప నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి (56) మృతదేహం ఉందని రిమ్స్ ఆర్‌ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు తెలియజేశారు. సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే తగిన ఆధారాలతో సంప్రదించాలని తెలియజేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ముద్దనూరు : కొండాపురం మండలంలోని తాళ్ల ప్రొద్దుటూరు పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసులు గురువారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్,ముద్దనూరు సీఐ దస్తగిరి,తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్‌లు తమ సిబ్బందితో కలసి పేకాటస్థావరంపై దాడిచేసినట్లు సమాచారం . ఈ సంఘటనలో అనంతపురం జిల్లాకు చెందిన సుమారు 10మంది నిందితులను అదుపులోకి తీసుకుని దాదాపు రూ.2లక్షల సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సొంత ఇంటి కలను నెరవేర్చిన సీఎం



నాకు వివాహం అయ్యి దాదాపు ఏడేళ్లయింది. గత ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయలేదు, ఇంటి స్థలం మంజూరు చేయలేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి, అందులోనే ఇళ్ల నిర్మాణాని హౌసింగ్ తరపున ఇంటిని కూడా మంజూరు చేయించారు. నాకు ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సొంత ఇంటి కలను సీఎం జగన్ నెరవేర్చారు.

- కడప గాయత్రి, ఒంటిమిట్ట

ఇంటర్యాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత



ప్రస్తుత ప్రభుత్వ పాఠశాల స్థితి గతులు కార్పొరేట్ కళాశాలలకు మించి ఉన్నాయి. ముఖ్యంగా విద్యార్థులకు ఇంటర్యాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా పాఠాలు చెప్పడంతో వారిలో చెప్పే పాఠాలపై ఏకాగ్రత పెరిగి సులువుగా పాఠాలను అర్థం చేసుకోగలుతున్నారన్నారు. దీని ద్వారా పాఠాలు చెప్పే సమయంలో ఎలాంటి సందేహాలు వచ్చినా ఐఎఫ్‌పీ సహాయంతో వ్యూజివల్‌గా వారి సందేహాలను తీర్చవచ్చు. విద్యార్థుల చదువు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేష కృషి చేసింది.

- వెంకట సుబ్బయ్య, ఒంటిమిట్ట జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు

నీటి గుంతలో పడి యువతి మృతి



భారతి (ఫైల్)

మదనపల్లె : నీటి గుంతలో పడి యువతి మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లి మండలంలో జరిగింది. పెంచుపాడు పంచాయతీ పందివారిపల్లెకు చెందిన మల్లికార్జున శాంతమ్మ దంపతుల కుమార్తె కె.భారతి (20) కొంతకాలంగా మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతోంది. రెండేళ్ల క్రితమే తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇంటర్మీడియట్ చదువుతున్న తన తమ్ముడు శివశంకర్ తో కలిసి గ్రామంలో ఉంటోంది. అక్క జ్యోతి, బావ రెడ్డి ప్రసాద్ వారి బాగోగులు చూసుకుంటున్నారు. ప్రతి అమావాస్య, పున్నమి రోజున భారతి తీవ్ర అనారోగ్యానికి గురై, మానసికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన భారతి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు బంధువులు రాత్రంతా చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించలేదు. ఉదయం గ్రామ సమీపంలోని చోటు పొలం వద్ద నీటినిల్వ గుంతలో పడి ఆమె మృతి చెంది ఉండటం, పొలం వద్దకు వచ్చిన వ్యక్తులు గుర్తించి గ్రామంలో సమాచారం అందించారు. భారతి మృతి చెందిన విషయాన్ని స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మోహన్ నాయక్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే స్కానింగ్ సెంటర్లు, వైద్యుల వైద్య వృత్తిని శాశ్వతంగా రద్దు చేయడంతోపాటు జైలు శిక్ష తథ్యమని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ, మాతా శిశు మరణాల నిర్మూలనపై నిర్వహించిన జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. లింగ నిర్ధారణ, గర్భస్రావాలు జరగకుండా ఆపాలన్నారు. ఇందుకు ప్రజల్లో విస్తృత ప్రచారం, అవగాహన కల్పించడంలో అంగన్వాడీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులను భాగస్వాములు చేయాలన్నారు. గర్భస్థ శిశు మరణాలు అరికడితే లింగ నిష్పత్తిలో అసమానత తొలుగుతుందన్నారు. భ్రూణ హత్యల నివారణ కోసం పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య, ఐసీడీఎస్, విద్యాశాఖలు విస్తృత ప్రచారం చేయాలన్నారు.బాల్య వివాహాలు, మహిళా వివక్ష వంటి అంశాలపై కిశోర బాలబాలికలకు కళాజాత బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రత్యేకించి దళిత, ముస్లిం, మైనార్టీ వర్గాలు జీవించే ప్రాంతాల్లో ఇవి చేపట్టాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం వల్ల ఆడపిల్లలను పిండ దశలోనే చంపేస్తున్నారని తెలిపారు. లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. గత మూడు నెలల్లో 75 బాల్య వివాహాలు అడ్డుకుని కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. 145 స్కానింగ్ సెంటర్లను తనిఖీచేశామని, ఈనెలాఖరులో మరో 14 సెంటర్లను తనిఖీ చేస్తామన్నారు. అదనపు డీఎంహెచ్‌ఓ ఉమామహేశ్వరకుమార్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, రిమ్స్ సూపరింటెండెంట్ రమాదేవి, దిశా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కేబుల్ వైరు చోరీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పట్టింవాండ్లపల్లి సమీప వ్యవసాయ బోర్లలో రైతులు అమర్చుకున్న కేబుల్ వైర్లను దొంగలు చోరీ చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి తమ బోర్ల వద్ద వంద మీటర్ల వైరును కత్తిరించుకెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుటుంబ సమస్యలతో ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. కోటవారి పల్లి పంచాయతీ నార్మాకుల తండాకు చెందిన మల్లప్ప నాయక్ కుమారుడు మల్లేష్ నాయక్ (40) కుటుంబ సమస్యల కారణంగా విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

ములకలచెరువు: స్థానిక ఇండియన్ బ్యాంకు ఎదురుగా బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రవీంద్ర (45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సోంపల్లి పంచాయతీ జయప్రకాష్ నగర్‌కు చెందిన రవీంద్ర తన సొంత పనులపై బుధవారం రాత్రి తన ద్విచక్ర వాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవీంద్ర పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. రోడ్డు పనులు సరిగా చేయని కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మదనపల్లె : లారీని ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన సంఘటన గురువారం మదనపల్లి పట్టణంలో జరిగింది. కురబలకోట మండలం తేట్టు పంచాయితీ మూర్తి నాయన పల్లెకు చెందిన రెడ్డి శేఖర్(35), వ్యక్తిగత పనులపై మదనపల్లి కు వచ్చాడు. మద్యం తాగి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలోని టిప్పు సుల్తాన్ మైదానం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని 108లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



రోడ్డు భద్రతా చర్యలపై సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ రవాణ, పోలీశ్ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై జేసీ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా కమిటీలోని ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో కృషి చేయాలని జేసీ సూచించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, స్టడ్స్, కల్వర్టులు, అండర్ పాస్‌ల వద్ద రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు. ఇన్‌చార్జ్ రవాణ శాఖ అధికారి దినేష్ చంద్ర, ఆర్డీఓ రంగస్వామి, డీఎస్పీ మహబూబ్ బాష, రవాణ శాఖ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, సహాయ ఇన్స్పెక్టర్లు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా సరస్వతి పూజ

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో మహాసరస్వతి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పోలం రెడ్డి విజయ, దేవదాయశాఖ అధికారి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని రామరాజుపల్లి పరిధిలోని రామచంద్రాపురంలో నివాసముంటున్న జింకా దస్తగిరి అలియాస్ మనోజ్ (29) అనే వ్యక్తి గురువారం ఉదయం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు.

ఈ సంఘటనపై పోలీసుల, స్థానికుల, బంధువుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. జింకా మహబూబ్‌బీ తన భర్తతో విడిపోయి రామచంద్రాపురంలో నివాసం ఉంటోంది. ఈమె పాలు అమ్ముకుని జీవనం సాగిస్తోంది. ఈమె పెద్దకుమారుడు దస్తగిరి అలియాస్ మనోజ్ (29) ఓ ప్రైవేట్ పెయింటింగ్ సంస్థలో రాయలసీమ రీజనల్ ఇన్‌ఛార్జ్‌గా వున్నాడు. రెండేళ్ల క్రితం చిన్న చౌక్ ప్రాంతంలోని ఓ యువతిని ప్రేమవివాహం చేసుకున్నాడు. తరువాత వారి మధ్య విభేధాలు వచ్చి దూరంగా ఉంటున్నారు. మరో కొడుకు సుభాన్ బీటెక్ వరకు చదివి ఉద్యోగ అన్వేషణలో వున్నాడు. ఈక్రమంలో ఈనెల 13వ తేదీన రాత్రి 10 గంటల వరకు తల్లి, ఇద్దరు కుమారులతో కలిసి కబుర్లు చెప్పుకున్నారు. పైగదిలో సుభాన్, బయట వసారాలో తల్లి, కింద గదిలో దస్తగిరి పడుకున్నారు. 14న తెల్లవారుజామున ఉన్నట్లుండి కేకలు వినిపించడంతో సుభాన్ కిందకు వచ్చాడు. ఆ సమయంలో దస్తగిరి శరీరమంతా మంటలతో కాలిపోయింది. వెంటనే 108కు సమాచారం ఇచ్చారు. ఆ సమయంలో తల్లి మహబూబ్‌బీ కూడా కొడుకు వద్ద ఏడుస్తూ కనిపించింది. వెంటనే దస్తగిరిని రిమ్స్‌కు తరలించారు. అక్కడ వార్డులో చికిత్స పొందుతూ ఉదయం 10:30 గంటల సమయంలో మృతి చెందాడు. ఈ సంఘటనలో తల్లికి, కుమారుడికి మధ్య ఏవో మనస్పర్ధలు ఏర్పడి పెయింట్ పనుల్లో ఉపయోగించే 'టిన్నర్'ను చల్లి నిప్పంటించిందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరారీలో ఉంది. రెండవ కుమారుడు సుభాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 'అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి' కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజా తెలియజేశారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె: విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ యువరాజ్ తెలిపారు. మండలంలోని పోతబోలు పంచాయతీ తురకపల్లికి చెందిన షేక్ హజీరా యాస్మీన్ (19) పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో చదువుతోంది. ఈనెల 12వతేదీ ఉదయం ద్విచక్ర వాహనంలో కాలేజీకి వెళ్తున్నాని ఇంటి వద్ద చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో గురువారం తల్లి జరీనా టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మదనపల్లెలో భారీ అగ్నిప్రమాదం

- రూ.15 లక్షల విలువైన కలప దగ్ధం
- పక్కనున్న ఇంటికి రూ. 10 లక్షల మేర తీవ్ర నష్టం
- గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన టూటౌన్ సీఐ యువరాజు



అగ్ని ప్రమాద స్థలంలో వివరాలు సేకరిస్తున్న సీఐ



అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన కలప

మదనపల్లె : మదనపల్లె పట్టణంలో గురువారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. నష్ట తీవ్రత అధికంగానే ఉన్నా,తక్షణ స్పందనతో ప్రాణం నష్టం జరగలేదు. పట్టణంలోని తారక రామా థియేటర్ సమీపంలోని నర్సింగ్ రాము వీధిలో స్థానికుడైన జహీర్ కొయ్యల మండి నిర్వహిస్తున్నాడు. రెండు ఇళ్ల మధ్య నున్న స్థలంలో కొయ్యల మండి ఉంది. గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా కొయ్యల మండిలో మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న కలపకు అంటుకొని పెద్ద ఎత్తున మంటలు రేగాయి. మంటల ఉధృతికి పైనున్న రేకులు వేడి చెంది, కిందనున్న కొయ్యలపై పడ్డాయి. దీంతో మరింతగా మంటలు పెద్దవయ్యాయి. ఇంతలో షాపు యజమాని జహీర్ మదనపల్లె ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఇంతలో రంజాన్ ఉపవాస దీక్ష కోసం తెల్లవారుజామునే లేచిన యువకులు అగ్నిప్రమాదం ఘటనను తెలుసుకొని పెద్ద ఎత్తున స్పందించారు. ఈలోగా మదనపల్లె ఫైర్ స్టేషన్ వాహనంతోపాటు వాల్మీకిపురం నుంచి మరో ఫైర్ వాహనం అక్కడికి చేరుకుంది. రెండు వాహనాలలోని అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. స్థానిక యువకులు పెద్ద ఎత్తున వారికి సహకారం అందించారు. వారం రోజుల క్రితమే జహీర్ ఒక లోడు కలప దింపారు. అగ్ని ప్రమాదంలో కలప మొత్తం పూర్తిగా దగ్ధమై దాదాపు రూ.15 లక్షల మేర నష్టం జరిగినట్లు బాధితుడు జహీర్ చెప్పాడు. అగ్ని ప్రమాదం జరిగిన కొయ్యలమండి పక్కనే ఉన్న ముంతాజ్ అనే మహిళకు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో తీవ్రంగా దెబ్బతింది. దాదాపుగా రూ 10 లక్షల మేర నష్టం జరిగిందని ఆమె తెలిపింది. ఉదయం సంఘటనా స్థలాన్ని టూ టౌన్ సి యువరాజు పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదానికి సంబంధించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలంలో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మదనపల్లె వాల్మీకిపురం అగ్నిమాపక అధికారులు శివప్ప,రాజగోపాల్, సిబ్బంది విజయ్ కుమార్ రెడ్డి శ్రీనివాసులు బాలాజీ రెడ్డి శేఖర్ రాజేంద్ర ఇమ్రాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.